తరలిన పార్టీ శ్రేణులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నగరంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినానికి 53వ డివిజన్‌కు చెందిన పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. నేతలు గురుప్రసాద్, బాలు, మల్లి, విజయ్‌మోహన్, శరత్, ప్రసన్న, చిన్నా, విజయ, రమణమ్మ, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన



నెల్లూరు(అర్బన్): వీఆర్సీ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వినూత్న నిరసన చేపట్టారు. తమ చుట్టూ నాలుగు పక్షాలుగా పెద్ద బాక్సులను ఏర్పాటు చేసుకున్నారు. కూటమి ఇచ్చిన హామీలను బాక్సులపై రాసి వాటిని గుర్తు చేస్తూ ప్రజలకు కనిపించేలా ర్యాలీలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వెన్నుపోటు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఎన్నికలకు ముందు హామీలను గుప్పించి.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నగరంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వీఆర్సీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆందోళన చేపట్టారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు.



వినతిపత్రమిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



హాజరైన జనసందోహం

ప్రజలను మోసం చేసి సంబరాలా..?

- రాష్ట్రంలో సాగుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం
- ఏడాది పాలనలో అమలు కాని హామీలు
- 'వెన్నుపోటు దినం'లో ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో దేన్నీ అమలు చేయని కూటమి ప్రభుత్వం.. ప్రజలను మోసం చేసి సంబరాలు జరుపుకొంటోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి మండిపడ్డారు. 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో భాగంగా నగరంలోని రైల్వేఫీడర్స్‌రోడ్డులో గల వెటర్నరీ హాస్పిటల్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీని బుధవారం నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వలంటీర్లకు రూ.ఐదు వేల వేతనాన్ని రూ.పది వేలకు పెంచుతామని చెప్పి వారిని నిర్దాక్షిణ్యంగా తొలగించారని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని చెప్పినా, నేటికీ అతీగతీ లేదని విమర్శించారు. ఇంటి వద్దకే వెళ్తున్న రేషన్ వాహనాలను నిలిపేసి, దుకాణాలకెళ్లి సరుకులను తెచ్చుకోవాలనడం దారుణమన్నారు. బూటకపు హామీలిచ్చి ప్రజలను మరోసారి సీఎం చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామనే మాటలు నీటిమూటలుగా మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మంత్రి లోకేశ్ నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలపై అరాచకాలు ఎక్కువవుతున్నాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామనే విషయాన్ని విస్మరించి కక్ష సాధింపు చర్యలు, రాజకీయ కక్షలకు తెగబడుతున్నారని చెప్పారు. వీరి చేష్టలతో రాష్ట్రంలో 390 మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



భారీ ర్యాలీ



హాజరైన పార్టీ శ్రేణులు



వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి, అరుణమ్మ తదితరులు

క్లుప్తంగా

ఘన నివాళి



నెల్లూరు(బృందావనం): గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంధ విద్యార్థికి ఆర్థిక సాయం



నెల్లూరు సిటీ: చిత్తూరుకు చెందిన అంధ విద్యార్థి ప్రకాష్ ఉన్నత చదువుల నిమిత్తం రూ.పది వేల ఆర్థిక సాయాన్ని ఐ కేర్ మిషన్ సభ్యులు బుధవారం అందజేశారు. నగరంలోని ఆర్టీసీ డిపో వద్ద ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మిషన్ ఉపాధ్యక్షుడు దినేష్, భరత్, శ్రావణ్‌కుమార్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకున్నారని, ఆర్థిక ఇబ్బందులతో తమను సంప్రదించగా, ఈ మొత్తాన్ని అందజేశామని వివరించారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఆర్టీఏ కార్యాలయ సమీపంలో ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. నిర్వాహకురాలు శివరంజనితో పాటు మనోహర్, జయరామయ్యను అరెస్ట్ చేశారు. సెక్స్ వర్కర్‌ను హోమ్‌కు తరలించారు.

కళాకారులకు డప్పుల అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవనంలో 500 మంది డప్పు కళాకారులకు డప్పులను ఎస్సీ కార్పొరేషన్ అధికారులు బుధవారం అందజేశారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందింటి సుబ్బయ్యమాదిగ, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కసుమూరు దర్గాకు సంగీత దర్శకుడు కోటి



వెంకటాచలం: మండలంలోని కసుమూరు గ్రామంలో మస్తాన్‌వలీ దర్గాను ప్రముఖ సంగీత దర్శకుడు కోటి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ క్రమంలో దర్గాకు వచ్చిన కోటికి ముజావర్లు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.

ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేయండి

నెల్లూరు(బారకాసు): నగరంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

⇨ ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వీఆర్ గ్రౌండ్స్ నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఏడుకు నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నెల్లూరు ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ అశోక్‌కుమార్, ఎంహెచ్‌ఓ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, మలేరియా విభాగాధికారి జిజియాబాయి, సూపరింటెండెంట్ సులోచన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నందన్

⇨ సీసీ రోడ్డును నూతనంగా నిర్మించి, ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని పలువురు కోరారు. ఈ మేరకు శంకరాగ్రహారంలోని రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలను సందర్శించిన కమిషనర్ నందన్‌కు వినతిపత్రాన్ని ఆస్పత్రి వైద్య బృందం, స్థానికులు తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొత్తహాల్ నుంచి విజయమహల్ గేట్ వరకు, బాబూ ఐస్‌క్రీమ్స్ నుంచి బాక్స్ టైపు బ్రిడ్జి వరకు నిర్మించిన సీసీ రోడ్లు ఎత్తుగా ఉండటంతో వర్షాకాలంలో వరద నీరు ఆస్పత్రి మార్గంలో చేరుతోందని చెప్పారు. దీనిపై చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, వైద్యులు రమణయ్య, రమేష్‌బాబు, హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలకంటి సేవలు చిరస్మరణీయం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య సేవలు చిరస్మరణీయమని యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య పేర్కొన్నారు. నగరంలోని వెన్నెకంటి రాఘవయ్య భవన్‌లో ఆయన జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యానాది గిరిజన ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు, యానాదుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, మహిళాధ్యక్షురాలు ఉషా, నగరాధ్యక్షురాలు కల్లూరు వరలక్ష్మి, ఇండ్ల రమ్య, మానికల నాగమణి, పాట్లూరు ప్రసాద్, మోపూరు శేషయ్య, యల్లంపల్లి శీనయ్య పాల్గొన్నారు.



ఎస్పీ బాలు మా కుటుంబ దైవం



సత్కరిస్తున్న శుభలేఖ సుధాకర్

నెల్లూరు(బృందావనం): కళామతల్లి ముద్దుబిడ్డ.. భారతీయ చలనచిత్రరంగం గర్వించదగ్గ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తమ కుటుంబ దైవమని.. గాయనిగా తనకు వెన్నుదన్నుగా నిలిచిన ఆయన్ను జీవితాంతం మర్చిపోలేనని.. ఆయన్ను తలుచుకుంటే మాటలు రావడం లేదని ప్రముఖ గాయని రమణ తెలిపారు. పద్మవిభూషణ్ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను పురస్కరించుకొని రమణకు మధురగాయని బిరుదుతో పాటు బాలు గారి అవార్డును చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సోదరి శైలజ మాట్లాడారు. గుంటూరులో కచేరి నిర్వహించాల్సిన రమణ, రాలేకపోవడంతో గాయనిగా తనకు అవకాశం కల్పించారంటూ నాటి స్మృతులను నెమరేసుకున్నారు. ప్రముఖ నటుడు శుభలేఖ సుధాకర్ మాట్లాడుతూ.. నెల్లూరులో ఏటా నిర్వహించే జయంతి కార్యక్రమాలకు తాము సతీసమేతంగా హాజరవుతామని చెప్పారు. తొలుత బాలు సినీచిత్ర గీతావళిని నిర్వహించారు. బాలగాన ప్రవీణ మాస్టర్ అజిత్‌రామ్, గాయని వైష్ణవి ఆలపించిన గీతాలు అలరించాయి. వీరిని శైలజ, శుభలేఖ సుధాకర్ సత్కరించారు. తొలుత ఎస్పీ బాలు చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి నివాళులర్పించారు. శ్రుతినీవు.. గతినీవు గీతాన్ని శైలజ ఆలపించారు. సంస్థ కార్యదర్శి యజ్ఞావఝుల శేషగిరీశం, సినీ రచయిత డాక్టర్ రాజేంద్రకుమార్, వీరిశెట్టి హజరత్‌బాబు, ఇమామీ ఆగ్రోటెక్ వైస్ ప్రెసిడెంట్ నారాయణమూర్తి, సీఎమ్మార్ షాపింగ్ మాల్ అధినేత మావూరి సంతోష్ రామ్, మురళి, కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గాయని రమణ

పేరంటాలమ్మ ఆలయ భూమి వేలం నేడు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని వెంకటమ్మ పేరంటాలమ్మ దేవస్థానానికి సంబంధించి మనుమసిద్ధినగర్‌లో ఉన్న ఎకరా 24 సెంట్ల భూమిని రెండు బిట్లుగా 11 ఏళ్ల కాలపరిమితికి ఈ – ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని గురువారం నిర్వహించనున్నామని ఈఓ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థాన ప్రాంగణంలో కార్యక్రమాన్ని ఉదయం 11.30కు నిర్వహించనున్నామని, ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు. వివరాలకు దేవస్థాన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

అవినీతిపై దర్యాప్తు చేయించాలి

నెల్లూరు రూరల్: పేదల గృహ నిర్మాణాల్లో కేంద్ర నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేయించాలని బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్వో ఉదయభాస్కర్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు.

ఎల్ఐసీ కాలనీలో చోరీ

నెల్లూరు(క్రైమ్): బీవీనగర్‌లోని ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్ ఎల్ఐసీ కాలనీలో నివాసం ఉంటున్న రవిశంకర్‌రెడ్డి తన ఇంటి పైగదిలో మంగళవారం రాత్రి నిద్రించారు. ఈ క్రమంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ఇంటి కిటికీ గ్రిల్స్‌ను బుధవారం తెల్లవారుజామున తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని 25 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండె వ్యాధులకు అధునాతన వైద్యం

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో గుండె వ్యాధులకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ విజయ్‌అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. గుండె వ్యాధులపై ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులకు బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం విలేకరులతో కార్డియాలజిస్టులు బాలకృష్ణ, జయరామయ్య, మనోహర్‌రెడ్డిలతో కలిసి విజయ్‌అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడారు. గుండెకవాటాలకు అత్యాధునిక చికిత్సను 24 గంటల పాటు తమ ఆస్పత్రిలో అందిస్తున్నామని వివరించారు.

50 వేల మొక్కలు నాటేలా చర్యలు



మాట్లాడుతున్న గంగాభవాని

నెల్లూరు (పొగతోట): జిల్లాలో నీటి యాజమాన్య సంస్థ ద్వారా 50 వేల మొక్కలను నాటేలా చర్యలు చేపట్టామని డ్వామా పీడీ గంగాభవాని పేర్కొన్నారు. జిల్లాలోని డ్వామా సిబ్బందితో బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఫామ్‌పాండ్స్, చెరువుల అభివృద్ధి తదితర కార్యక్రమాలను ఉపాధి నిధులతో చేపట్టామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా మొక్కలను నాటుతున్నామని వివరించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించనున్నామని చెప్పారు.

పక్కాగా ల్యాబ్ రిపోర్టుల నిర్వహణ

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో రక్త పరీక్షల రిపోర్టులను పక్కాగా నిర్వహించాలని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 100 రోజుల పాటు టీబీ నివారణపై ప్రజలను చైతన్యం చేయడం, అనుమానితులకు రక్త, గళ్ల తదితర పరీక్షలను నిర్వహించనున్నామని తెలిపారు. పరీక్షల వివరాలను ఆన్‌లైన్లో పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఎవరికైనా టీబీ ఉందని నిర్ధారణైతే వారికి మందులను నెలానెలా అందించాలని కోరారు. జిల్లా మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



బాలకార్మికులతో పనిచేయిస్తే చర్యలు



నెల్లూరు (పొగతోట): హోటళ్లు, వ్యాపార సంస్థలు, గ్యారేజీల్లో బాలకార్మికులతో పని చేయించే యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు చేపడతామని కార్మిక శాఖ సహాయ కమిషనర్ గౌస్, బాలల సంరక్షణాధికారి సురేష్ స్పష్టం చేశారు. ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో తనిఖీలను బుధవారం నిర్వహించి ముగ్గురు బాలకార్మికులను గుర్తించారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన కొనసాగుతోంది. ఇందులో భాగంగా అన్ని డిపోల్లో కార్మికులు ఎర్ర బ్యాడ్జీలను ధరించి విధులకు బుధవారం హాజరయ్యారు. అధికారులు స్పందించకపోతే నిరసన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు.



డీఎంహెచ్‌ఓకు జీఓ ప్రతుల అందజేత

నెల్లూరు(అర్బన్): వైద్య, ఆరోగ్య శాఖలో గతంలో డివిజన్ స్థాయిలో, ప్రస్తుతం మండలస్థాయిలో పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పేరు మారుస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రతులను డీఎంహెచ్‌ఓ సుజాతకు బుధవారం అందజేశారు. సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్, వెల్ఫేర్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర జనరల్ సెక్రటరీ చేజర్ల సుధాకర్‌రావు, జాయింట్ సెక్రటరీ సునీత, నేతలు ఆరోగ్య మేరీ, అశోక్, ఉమర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ట్రై సైకిళ్ల పంపిణీ

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 100 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, రమణారెడ్డి, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మాజీ మేయర్ భానుశ్రీ, బీజేపీ నేత ఈశ్వర్ పాల్గొన్నారు.

